## సింగరేణి జాయింట్ వెంచర్‌ను ఒప్పుకోం


**తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం**

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : రామగుండం థర్మల్ ప్లాంట్‌ను సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించేందుకు ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదని, ఈ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం చేసింది. జాయింట్ వెంచర్ అంటే ప్రైవేటీకరణను ప్రోత్సహించడమేనని జేఏసీ నేతలు ఆరోపించారు. జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ఖైరతాబాద్‌లోని విద్యుత్తు సౌధలో జేఏసీ నేతలు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ.. మూడేండ్లుగా జెన్‌కో లాభాల్లో నడుస్తున్నదని, 2020-21లో రూ. 168 కోట్లు, 2021-22లో రూ.394.46 కోట్లు, 2022-23లో రూ.472.94 కోట్ల లాభాలను ఆర్జించిందని తెలిపారు. జెన్‌కో ఈక్విటీతోనే రామగుండంలో నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి, వజీర్, మాజీద్, రమేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఉత్పత్తి లక్ష్యం పెంపు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి లక్ష్యాన్ని క్రమంగా పెంచుకుంటున్నది. ఇది వరకు రోజుకు రెండు లక్షల బొగ్గును ఉత్పత్తి, రవాణా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ.. తాజాగా దీనిని 2.1 లక్షల టన్నులకు పెంచుకున్నది. బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని కంపెనీ సీఎండీ ఎన్ బలరాం ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో పాటు రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని అన్ని ప్రాంతాల జీఎంలకు ఆయన ఆదేశాలిచ్చారు. భారీ వర్షాలతో కొద్ది రోజుల పాటు సింగరేణిలో ఉత్పత్తి నిలిచిపోగా, వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా ఈ లక్ష్యాన్ని నిర్ధేశించారు.

### • నల్లబ్యాడ్జీలతో కేటీపీపీ ఉద్యోగుల నిరసన




థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాలను జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యాన్ని అంగీకరించబోమని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కేటీపీపీలో శనివారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. - గణపురం

# చేనేత రుణమాఫీ ఏమాయే..!

- ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేస్తున్న కాంగ్రెస్ సర్కారు
- తీవ్ర ఆవేదనలో చేనేత కార్మికులు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ చేస్తామని మాట ఇచ్చిన ప్రభుత్వం.. ఇంతవరకు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 10 వేల మంది కార్మికులు ఈ మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 'చేనేత పాలసీ' అనేది ఏదీ లేదని చేనేత కార్మికులు మండిపడుతున్నారు. చేనేతలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని చేనేత కార్మికసంఘం రాష్ట్ర నాయకులు కూరపాటి రమేశ్, చెరుకు స్వామి విమర్శిస్తున్నారు. మరికొన్ని డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

- చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించాలి.
- చేనేతల కోసం రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలనే డిమాండ్‌ను నెరవేర్చాలి
- థ్రిఫ్ట్ ఫండ్, యూరన్ సబ్సిడీ, నేతన్నకు బీమా పథకాలు అమలు చేయాలి
- బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- వస్త్రనిల్వలు వెంటనే కొనుగోలు చేయాలి
- వర్కర్ టూ ఓనర్, జనతా వస్త్ర పథకాలను అమలు చేయాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి
- యూరన్ సబ్సిడీ నిధులను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి
- ప్రతి నేతన్నకు పెట్టుబడిసాయం కింద రూ.5 లక్షలు అందించాలి
- ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాలను రాష్ట్రంలో ఉత్పత్తి చేయించాలి.

# టీ కొట్టు శివకు ఐదు కొలువులు

- పోటీ పరీక్షల్లో పెద్దపల్లి జిల్లా ధర్మారం యువకుడి సత్తా
- గత మార్చిలో గురుకుల జేఎల్, పీజీటీ, టీజీటీల్లో ప్రతిభ
- తాజాగా జేఎల్, డీఎస్సీలో విజయ ఢంకా




మహేశ్ కుమార్

ధర్మారం, అక్టోబర్ 5: ఓ పేదింటి బిడ్డ.. ప్రభుత్వ కొలువులు కొల్లగొట్టాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులతో కొన్నాళ్లు టీకొట్టు నడిపిన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఉడాన్ శివ మహేశ్ కుమార్.. ఆరు నెలల్లోనే ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తాచాటాడు. ధర్మారానికి చెందిన ఉడాన్ సుశీల-లక్ష్మణ్ దంపతులకు శివ మహేశ్ రెండో కొడుకు. ధర్మారంలో చదువుకుంటూనే తల్లిదండ్రులకు సాయపడేవాడు. 2014లో సునీతను వివాహం చేసుకున్నాడు. 2020లో పీజీ పూర్తిచేశాడు. కరోనా టైంలో రాజారాంపల్లిలో టీకొట్టు నడిపాడు. తర్వాత దానిని వదిలేసి తల్లిదండ్రులు, మిత్రుల సహకారంతో 2022లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకున్నాడు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023లో గురుకులాల లెక్చరర్, టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. అదే ఏడాది ఆగస్టులో పరీక్షలు రాశాడు. గత మార్చిలో ఫలితాలు రాగా.. జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ కొలువులకు ఎంపికయ్యాడు. జూనియర్ లెక్చరర్ పోస్టును ఎంపిక చేసుకొని ప్రస్తుతం నిర్మల్ జిల్లా మామడలోని గురుకులంలో పనిచేస్తున్నాడు. అలాగే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల భర్తీ పరీక్ష, ప్రస్తుత ప్రభుత్వం ఆగస్టు 2024లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు రాసి ప్రతిభ చాటాడు. ఇటీవలే విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్, డీఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈ విజయం తన తల్లిదండ్రులకే అంకితమని శివమహేశ్ తెలిపారు.

## నిలిచిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పలు జిల్లాల్లో డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిలిచిపోయింది. కొన్ని జిల్లాల్లో ఇంకా 1:3 జాబితాలు విడుదల కాలేదు. కోర్టుకేసుల కారణంగా నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. శనివారం వరకు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్, భాషాపండితులు, పీఈటీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాగా, స్పెషల్ ఎడ్యుకేషన్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కోర్టుకేసులు లేని జిల్లాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిచేశామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తెలిపారు.

- నల్లగొండలో ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కానీ ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ జాబితాలో 31కి 29 మంది హాజరయ్యారు.



హరీశ్ (ఫైల్) సురేశ్ (ఫైల్) హేమలత (ఫైల్)


## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబం బలి

- రూ.30 లక్షలకుపైగా కుమారుడి అప్పులు
- 20 గుంటల భూమి అమ్మి అప్పుల చెల్లింపు
- మనస్తాపంతో కుమారుడితోపాటు తల్లిదండ్రుల ఆత్మహత్య
- నిజామాబాద్ జిల్లా వడ్డేపల్లిలో విషాదం

ఎడపల్లి, అక్టోబర్ 5: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో కుటుంబం బలైంది. రూ.లక్షలు పోగొట్టిన ఓ యువకుడితోపాటు అతడి తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన శనివారం నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగణవేణి సురేశ్ (55), హేమలత (48) దంపతులకు ఇద్దరు సంతానం. మెదడువాపు వ్యాధితో కూతురు చిన్నప్పుడే మృతి చెందింది. ఏకైక కుమారుడు హరీశ్ (22) నిజామాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. ఆర్నెళ్ల క్రితం పని మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. సురేశ్ దంపతులు చిన్న కిరాణషాపు నడుపుతూ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కొత్త ఇల్లు కట్టుకుందామన్న ఆశతో గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. కుమారుడు హరీశ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి భారీగా అప్పులు చేశాడు. దీంతో తల్లిదండ్రులు ఇంటి నిర్మాణాన్ని ఆపేశారు. హరీశ్ చేసిన రూ.30 లక్షలకుపైగా అప్పులను తమకున్న 20 గుంటల భూమిని అమ్మేసి తీర్చారు. అయినప్పటికీ కుమారుడిలో మార్పు రాలేదు. నలుగురిలో తిరగలేక మనస్తాపం చెందిన తల్లిదండ్రులు, కుమారుడు శుక్రవారం రాత్రి ఉరేసుకున్నారు. తెల్లారినా ఎలాంటి అలికిడి లేకపోవడంతో ఇరుగుపొరుగు ఇంటి వెనుక నుంచి చూడగా వేలాడుతూ కనిపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఉగాండాలో జనగామవాసి హత్య

**సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో ప్రాణాలొదిలిన తిరుమలేశ్**



తిరుమలేశ్ (ఫైల్)

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : ఉగాండా దేశంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జనగామ వాసి ఇటికాల తిరుమలేశ్ (41) శుక్రవారం అక్కడ హత్యకు గురయ్యాడు. మృతుడి తమ్ముడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డ ఏరియాకు చెందిన తాపీ మేస్త్రీ ఇటికాల కిష్టయ్య-కిష్టమ్మ దంపతుల పెద్ద కుమారుడు తిరుమలేశ్ నల్లగొండ జిల్లాకు చెందిన రాయల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 2014 నుంచి ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ కంపెనీకి ఉగాండాలోని నమ్మసాలలో బ్రాంచ్ కార్యాలయం ఉండటంతో 15 నెలల నుంచి భార్య, కుమారుడితో కలిసి తిరుమలేశ్ అక్కడే ఉంటున్నాడు. గురువారం ఉదయం 9.30 గంటలకు (ఉగాండా కాలమానం ప్రకారం) డ్యూటీకి వెళ్లాడు. అక్కడ కొత్తగా విధుల్లో చేరిన సెక్యూరిటీ గార్డు ఓపియో మద్యం మత్తులో గాల్లోకి కాల్పులు జరుపుతుండగా సహోద్యోగులతో కలిసి తిరుమలేశ్ బయటకు వచ్చాడు. సెక్యూరిటీగార్డు విచక్షణ కోల్పోయి తిరుమలేశ్‌పైకి కాల్పులు జరపగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తిరుమలేశ్ భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కాగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో వారిని పరామర్శించారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## వైభవంగా వెంకన్న వార కల్యాణం


చిల్పూరు, అక్టోబర్ 5 : మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవమూర్తులను అలంకరించి వేదమంత్రాలతో పూజలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం కంచనపల్లికి చెందిన చంద్రశేఖర్-చంద్రకళ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో మోహన్ బాబు, ఆలయ శాశ్వతదాత మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, దేవస్థానం మాజీ డైరెక్టర్ సంగోజు శంకరలక్ష్మి-మోహన్‌చారి దంపతులు, ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఓటరుగా నమోదు చేసుకోవాలి

కొడకండ్ల, అక్టోబర్ 5 : భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ చంద్రమోహన్ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని అర్హులైన ఉపాధ్యాలు తహసీల్దార్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రంలో దరఖాస్తు చేయాలని కోరారు.

## సూర్యాపేట అడిషనల్ కలెక్టర్ కారు ఢీ..

**వృద్ధురాలికి తీవ్ర గాయాలు**



గాయపడిన పద్మ

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 5 : సూర్యాపేట అడిషనల్ కలెక్టర్ కారు ఢీకొని వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన ఘటన జనగామ-వరంగల్ హైవేపై స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత ఆదివారం సాయంత్రం కారు జనగామ నుంచి వరంగల్‌కు వెళ్తున్నది. స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ సమీపంలో వృద్ధురాలు గంగారపు పద్మ రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. ఈ ఘటనలో పద్మకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అడిషనల్ కలెక్టర్ వాహనాన్ని అడ్డుకున్నారు. వృద్ధురాలిని 108 అంబులెన్స్‌లో ఈఎంటీ హరికృష్ణ, పైలెట్ రాజన్న ప్రథమ చికిత్స అందించి వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తలరించారు. బాధితురాలి స్వగ్రామం మండలంలోని ఇప్పగూడెం అని స్థానికులు తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిల్పూరు, అక్టోబర్ 5 : మండలంలోని రాజవరానికి చెందిన జక్కుల కొమురయ్య (60) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 14న జక్కుల కొమురయ్య సైకిల్‌పై రాజవరానికి వెళ్తుండగా కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కొమురయ్యను వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## డీజేలపై నిషేధాన్ని విధించొద్దని ఎమ్మెల్యేకు వినతి

కొడకండ్ల, అక్టోబర్ 5 : డీజేలపై నిషేధం విధిస్తే దీనిపై ఆధారపడిన ఎంతోమంది కుటుంబాలకు ఉపాధి లేకుండా పోతుందని పలువురు పేర్కొన్నారు. ఈ విషయమై పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డికు శనివారం వినతి పత్రం అందజేసినట్లు డీజే యూనియన్ బాధ్యుడు జవ్వాజీ శ్రావణ్‌కుమార్ తెలిపారు. కొద్ది రోజులుగా డీజేల వినియోగంపై నిషేధం విధిస్తారని వార్తలు వస్తుండడంతో దీనిపై ఆధారపడి తాము ఆందోళన చెందుతున్నామని వివరించారు. తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకూ డీజేలతో ఎంతో మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు.



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రాజమౌళి

## ప్రయాణంలో జాగ్రత్తలు తీసుకోవాలి

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 5 : సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రయాణాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎస్సై రాజమౌళి అన్నారు. సీఐ వేణు ఆదేశాల మేరకు స్థానిక బస్టాండ్ సమీపంలో శనివారం ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఓవర్ స్పీడ్‌తో ప్రయాణం చేయొద్దని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని ఆయన సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రాజమౌళి కోరారు.

## కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలపై పోరాటం : సీపీఎం

రఘునాథపల్లి, అక్టోబర్ 5 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఇబ్రహీంపూర్‌లో జరిగిన పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను ఆదానీ, అంబానీలకు దోచి పెడుతున్నదని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయాలని మహేందర్ డిమాండ్ చేశారు. రైతుల పంట రుణాలను వంద శాతం మాఫీ చేయాలన్నారు. అనంతరం గ్రామకార్యదర్శిగా నర్జన మల్లేశ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో పండుగ ఆంజనేయులు, శివార్ల ఆంజనేయులు, గ్యార నర్సింగరావు, రమ, శారద, స్వరూప, ఉమారాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కేయూలో ఎన్‌సీసీ క్యాంపు ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 5 : కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ పదో తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ క్యాంపు ప్రారంభించారు. 500 మందితో ఖమ్మం, వరంగల్ గ్రూప్ రిపబ్లిక్ డే సన్నాహక క్యాంపు జరుగుతుందని కమాండెంట్ కర్నల్ ఎస్ఎస్ రామదురై తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు డిప్యూటీ కమాండర్ లెఫ్టినెంట్ కర్నల్ రవి సునారే, సుబేదారి మేయర్ సోరస్య, కెప్టెన్ విజయ్, లెఫ్టినెంట్ స్వామి, రాజమాణిక్యం, వాసు, భవాని, సూపరింటెండెంట్ అరుణ, కుమారస్వామి, సతీశ్, మహేశ్, ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.



పాడె మోస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే రామచంద్రునాయక్

## నరేశ్‌రెడ్డికి కన్నీటి వీడ్కోలు..

**అంతిమయాత్రకు హాజరైన ప్రముఖులు**

మరిపెడ, అక్టోబర్5: మరిపెడ మండలంలోని పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన నూకల నరేశ్‌రెడ్డి శుక్రవారం మృతి చెందగా, అంతిమ యాత్రకు పలువురు ప్రముఖులు హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు. పురుషోత్తమాయగూడెంలోని అతని వ్యవసాయక్షేత్రంలో శనివారం మధ్యాహ్నం వరకు నరేశ్‌రెడ్డి పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. అనంతరం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. 40ఏండ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మంచి గుర్తింపు సంపాదించాడు. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ ఆర్ సురేందర్‌రెడ్డి తదితర రాజకీయ ప్రముఖులు అతనితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. పార్టీలకతీతంగా వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి కన్నీటివీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావ్, మాజీ మంత్రులు సత్యవతిరాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఖమ్మం,మహబూబాబాద్ ఎంపీలు రఘురాంరెడ్డి, బలరామ్‌నాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రామచంద్రునాయక్, మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బిందు తదితరులు ఉన్నారు.



నరేశ్‌రెడ్డి పార్థివ దేహం వద్ద రోదిస్తున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

## 'ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి'

నర్మెట, అక్టోబర్ 5: వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ ఫలితాలు విడుదల చేయడం మాదిగలకు, ఉప కులాలకు అన్యాయం చేయడమేనని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిశోర్ అన్నారు. మండల కేంద్రంలోని వినాయక గార్డెన్‌లో ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్, వీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాల మండల స్థాయి సమావేశం శనివారం జరిగింది. కిశోర్ మాట్లాడుతూ నిండు అసెంబ్లీలో దేశంలో తామే ముందు వర్గీకరణను అమలు చేస్తామని, అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని ఆయన ఆరోపించారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 9న తెలంగాణ వ్యాప్తంగా నిరసన చేపడుతామని అన్నారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొంపెల్లి అంబేద్కర్, రాష్ట్ర నాయకులు చుంచు రాజు, గువ్వల రవి, నిర్మల భాస్కర్, కంతి చరణ్‌కుమార్, బిచ్చాల వంశీ, కృష్ణమూర్తి, పిన్నింటి రవీందర్ పాల్గొన్నారు.



వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా స్టీల్ ప్లేట్స్‌తో కవులు

## వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో సాహిత్య, సాంస్కృతిక పోటీలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 5 : వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ, జేవీవీ, వీఎస్ఏస్‌లు సంయుక్తంగా విద్యార్థులకు సాహిత్య, సాంస్కృతిక అంశాల్లో ప్రతిభా పాటవ పోటీలు, కవిగాయక సమ్మేళనం హనుమకొండలోని ప్రభుత్వ అభ్యసన ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. అంపశయ్య నవీన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో ఇంకా చైతన్యం రావాల్సి ఉందని, అందుకు ఇలాంటి అవగాహన సదస్సులు అవసరమన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిరోధించే దిశగా యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏర్పాటు చేసిన ఉచిత స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ బ్యాంక్‌లో 100 స్టీల్ పల్లాలు, 100 గ్లాస్‌లు, 100టీ గ్లాస్‌లు, ఇతర స్టీల్ వస్తువులు 100 చొప్పున ప్రజలకు శుభకార్యాలకు నామమాత్రపు నిర్వహణ రుసుంతో అందించేందుకు ఏర్పాటు చేశారు. ప్రధాన కార్యదర్శి శ్రవణ్‌కుమార్‌ను 9948609591 నంబర్‌లో సంప్రదించాలని సంస్థ అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు నాగేశ్వర్‌రావు, శ్యామ్‌సుందర్, రవిబాబు, సుధాకర్‌స్వామి, రాజ్‌కుమార్, జేవీవీ నుంచి భిక్షపతి, వందన, అశోక్, నరేశ్, ఉప్పలయ్య, పెండ్లి ఉపేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, ప్రకాశ్, బ్రహ్మాచారి, సిరాజుద్దీన్, రవికుమార్, విష్ణు పాల్గొన్నారు.

# మూడు కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఓటరు నమోదు

పాలకుర్తి, అక్టోబర్ 5 : వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మండల కేంద్రంలో మూడు ఓటర్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసిన్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, మండల విద్యావనరుల కేంద్రంలో ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాకేశ్ పాల్గొన్నారు.

**భూమిని పరిశీలించిన తహసీల్దార్**

మండలంలోని వల్మిడిలో బీరప్ప గొర్రెల కాపరుల సంఘానికి కేటాయించిన సర్వే నంబర్ 389లో 4.38 గుంటల భూమిని తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ రాకేశ్ ఉన్నారు.




ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న శ్రీనివాస్